సాక్షి తిరుపతి

గురువారం । 27 । జూలై । 2023



తిరుమలలో రెస్ట్‌హౌస్ ప్రారంభం
తిరుమలలో నారాయణి జగదీష్ విశ్రాంత గృహాన్ని టీటీడీ బోర్డు చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి బుధవారం ప్రారంభించారు. - 8లో



ప్రగతి మణిహారం
ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రోడ్ల మరమ్మతు. అభివృద్ధి పనులపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. - 8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	31	24
చిత్తూరు	32	25
తిరుమల	28	21
గూడూరు	33	27
నగరి	34	26

న్యూస్‌రీల్

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి సాదర స్వాగతం



హైకోర్ట్ ప్రధాన న్యాయమూర్తికి పుష్పగుచ్ఛం అందిస్తున్న కలెక్టర్

తిరుపతి సిటీ : తిరుమల పర్యటనలో భాగంగా బుధవారం తిరుపతికి విచ్చేసిన ఏపీ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయికి సాదర స్వాగతం లభించింది. స్థానిక పద్మావతి అతిథి గృహంలో ఆయనను కలెక్టర్ వెంకటరమణారెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

సాంకేతికతతో విద్యాబోధన



మాట్లాడుతున్న డీఈఓ శేఖర్

ఏర్పేడు : ఉపాధ్యాయులు నూతన సాంకేతికతను వినియోగించుకుని విద్యాబోధన చేయాలని డీఈఓ శేఖర్ ఆదేశించారు. బుధవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కాంప్లెక్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. టీచర్లు ఎప్పటికప్పుడు బోధనా నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. నిత్యం కొత్త విషయాలను నేర్చుకుని విద్యార్థులకు తెలియజేయాలని కోరారు. బడి బయట పిల్లలను బడిలో చేర్చేందుకు కృషి చేయాలన్నారు. జగనన్న విద్యాకానుక కిట్‌లను పిల్లలందరికీ అందించాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సీఎంఓ సురేష్, ఏఎల్ఎస్ఓ శ్రీధర్, ప్రధానోపాధ్యాయిని సునీత పాల్గొన్నారు.

కర్ణాటక సత్రాల అభివృద్ధిపై సమీక్ష



మాట్లాడుతున్న టీటీడీ ఈఓ ధర్మారెడ్డి

తిరుమల : తిరుమలలోని కర్ణాటక సత్రాల అభివృద్ధి పనుల పురోగతిపై టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి సమీక్షించారు. బుధవారం స్థానిక అన్నమయ్య భవన్‌లో కర్ణాటక మంత్రి రామలింగారెడ్డితో కలిసి ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. ముందుగా టీటీడీ చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పనుల పురోగతిని తెలియజేశారు. ఈ ఏడాది డిసెంబర్‌లోపు పనులు పూర్తవుతాయని వివరించారు. కర్ణాటక స్టేట్ చారిటీస్ ప్రతినిధులు తమ డిజైన్లతో కూడిన ప్రణాళికను వెల్లడించారు. షెడ్యూల్ ప్రకారం పనులు పూర్తి చేసేందుకు అవసరమైన డిజైన్లను సకాలంలో అందించాలని ఈఓ కోరారు. ఎలాంటి జాప్యం లేకుండా టీటీడీకి అవసరమైన సమాచారం అందించాలని కర్ణాటక మంత్రి తమ అధికారులను ఆదేశించారు. సమీక్షలో కర్ణాటక దేవాదాయ శాఖ కార్యదర్శి రాజేంద్ర కటారియా, కమిషనర్ డాక్టర్ బసవరాజ్, , టీటీడీ డీఈ ఎలక్ట్రికల్ రవిశంకర్‌రెడ్డి, డిప్యూటీ ఈఈ సుధాకర్ పాల్గొన్నారు.

రేపటి నుంచి వారణాసిలో చతుర్వేద హవనం

తిరుమల : ఎస్వీ ఉన్నత వేదాధ్యయన సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి ఆగస్టు 3వ తేదీ వరకు వారణాసిలో శ్రీ శ్రీనివాస చతుర్వేద హవనం నిర్వహించనున్నారు. లోక కల్యాణార్థం ఏడు రోజుల పాటు నాలుగు వేదాలను పఠించి యజ్ఞేశ్వరునికి సమర్పణ చేయనున్నారు. ఎస్వీ ఉన్నత వేదాధ్యయన సంస్థ ప్రత్యేకాధికారి డాక్టర్ విభీషణ శర్మ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

జాతీయస్థాయి పురస్కారాలకు దరఖాస్తులు

తిరుపతి కల్చరల్ : వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ చాటిన వారికి సేవాభారతి, తెలుగుతేజం జాతీయస్థాయి పురస్కారాలు అందించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఈఎస్ఎస్ నారాయణ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ సమాజ సేవకులు, ఉపాధ్యాయులు, వైద్యులు, కళాకారులు, కవులు, రచయితలు, క్రీడాకారులు, విద్యావంతులు, కార్మికులు, కర్షకులు తమ సేవలను, ప్రతిభను గురించి తెలియజేసే వివరాలతో పాటు 4 పాస్ పోర్టు సైజు ఫొటోలను దరఖాస్తుకు జత చేసిన దరఖాస్తులను ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ, 1-20-164, గోకుల్ నగర్, వెంకటాపురం పోస్టు, తిరుమలగిరి, సికింద్రాబాద్-15కు పంపించాలని కోరారు.

కనుపాపకు రక్షణ



నవజాత శిశువుల ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోంది. ముఖ్యంగా చిన్నారుల్లో తలెత్తే కంటి సమస్యలను ఆదిలోనే అరికట్టేందుకు పకడ్బందీ కార్యాచరణ అమలు చేస్తోంది. తల్లిదండ్రుల నిర్లక్ష్యం.. ఆర్థిక ఇబ్బందులు.. పౌష్టికాహార లోపం తదితర కారణాలతో పిల్లల భవిష్యత్తు అంధకారం కాకుండా కట్టుదిట్టంగా చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా బాల భవిత కేంద్రాల ద్వారా రెటీనా పరీక్షలు చేయిస్తోంది. తొలి దశలోనే లోపాలను గుర్తించి సకాలంలో చికిత్స అందిస్తోంది. పసిపాపలను కనురెప్పలా కాపాడుకుంటోంది.

- చిన్నారుల కంటికి రెప్పలా బాల భవిత కేంద్రాలు
- హైరిస్క్ నవజాత శిశువులకు విధిగా రెటీనా పరీక్షలు
- ప్రతి నెలా రెండు పర్యాయాలు ప్రత్యేక శిబిరాలు
- పిల్లల్లో అంధత్వ నివారణే లక్ష్యంగా చర్యలు
- గుర్తించిన బాధితులకు మెరుగైన చికిత్సలు



చిత్తూరు బాల భవిత కేంద్రంలో చిన్నారికి కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య బృందం

సాక్షి తిరుపతి డెస్క్ : ఆరోగ్య సమాజానికి ఆదిలోనే అవరోధం ఎదురవుతోంది. బాల్యంలోనే చిన్నారులు అనారోగ్యం బారిన పడుతున్నారు. రక్తహీనత..దృష్టిలోపం..నరాల బలహీనత వంటి సమస్యలు వారిని వేధిస్తున్నాయి. ఇవన్నీ నవజాత శిశువుల కంటిపై ప్రభావం చూపుతోంది. ఈ ఇబ్బందులను అధిగమించేందుకు ప్రభుత్వం ప్రణాళికా బద్ధంగా అడుగుల వేస్తోంది.

బాలలకు 'భవిత'

ఉమ్మడి జిల్లాలోని చిత్తూరు, తిరుపతిలో బాల భవిత కేంద్రాలున్నాయి. పిల్లల్లో శారీరక, మానసిక వైకల్య నివారణే లక్ష్యంగా ఈ కేంద్రాలు పనిచేస్తున్నాయి. ప్రధానంగా నవజాత శిశువుల్లో కంటికి సంబంధించిన సమస్యను తొలి దశలోనే గుర్తించి అరికట్టేందుకు కృషి చేస్తున్నాయి. ఈ క్రమంలో ప్రతి నెలా రెండు రోజుల పాటు ప్రత్యేకంగా రెటినోపతి ఆఫ్ ప్రీమెల్యారిటీకి పరీక్షలను ఆయా కేంద్రాల్లో చేయిస్తున్నారు. వీటి ఆధారంగా లోపాలను గుర్తించి పసిగుడ్డును కాపాడేందుకు చర్యలు చేపడుతున్నారు.

రక్తనాళాల ఎదుగుదలతోనే..

రెటినోపతి ఆఫ్ ప్రీమెచ్యూరిటీ (ఆర్‌ఓపీ) అనేది ప్రీమెచ్యూర్ శిశువు కంటిలో రక్తనాళాలు అసాధారణ ఎదుగుదల కారణంగా సంభవిస్తుంది. పిండం అభివృద్ధి చెందే సమయంలో రెటీనా మధ్య భాగం నుంచి రక్తనాళాలు వృద్ధి చెందుతాయి. ఈ ప్రక్రియ సాధారణ ప్రసవానికి కొన్ని వారాల ముందు పూర్తవుతుంది. అయితే నెలలు నిండని శిశువులలో ఇది అసంపూర్ణంగా ఉంటుంది. రక్తనాళాలు సాధారణంగా పెరిగితే ఆర్‌ఓపీ జరగదు. దీనికి విరుద్ధంగా, ఒకవేళ నాళాలు పెరగడం అసాధారణంగా ఉన్నట్లయితే ఆర్‌ఓపీ వచ్చే అవకాశాలు ఉంటాయి.

ప్రతి నెలా రెటీనా పరీక్షలు

నవజాత శిశువుల్లో వచ్చే కంటి సమస్యలను నివారించేందుకు బాలల భవిత కేంద్రంలో ప్రతి నెలా రెండు పర్యాయాలు రెటీనా పరీక్షల నిర్వహణకు ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నారు. ప్రతి క్యాంపుకు 70 మందికిపైగా వచ్చి స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకుంటున్నారు. వీరిలో ఆర్‌ఓపీ తేలితే వారికి మెరుగైన చికిత్స అందేలా చూస్తున్నారు. గత ఏడేళ్లలో ఈ కేంద్రాల ద్వారా 3,576 మందికి కార్పొరేట్ ఆస్పత్రుల సాయంతో రెటీనా స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. ఇందులో 128 మందిలో ఆర్‌ఓపీ సమస్యను గుర్తించి చికిత్స అందించారు. శస్త్రచికిత్స అవసరమైతే ఉచితంగా చేయించే బాధ్యతను భవిత కేంద్రం నిర్వాహకులు తీసుకుంటున్నారు.

ఉమ్మడి జిల్లాలోని భవిత కేంద్రాల్లో ఆర్‌ఓపీ స్క్రీనింగ్ పరీక్షల వివరాలు

సంవత్సరం	చిత్తూరు	తిరుపతి	గుర్తించిన బాధితుల సంఖ్య
2017	307	198	17
2018	194	167	21
2019	323	227	20
2020	169	232	10
2021	210	324	23
2022	300	424	35
2023	273	274	7



బాల భవిత కేంద్రంలో పురిటిబిడ్డలతో తల్లులు

ఆర్‌ఓపీకి ఇవీ కారణాలు..

- పుట్టిన బిడ్డ 900 గ్రాముల కంటే తక్కువ బరువు ఉంటే...
- నెలల నిండకుండా శిశువు జన్మించడం
- పుట్టిన సమయంలో ఏడవకపోవడం
- ఎస్ఎన్‌సీయూలో చికిత్స అందించిన పిల్లలకు..
- వంశంపారంపర్యంగా కంటి సమస్యలు ఉంటే..

ఈ క్రమంలో రెటినల్ పరీక్షను శిశువు పుట్టిన 30 రోజుల లోపు చేయించుకోవాలి.

చికిత్స ఇలా..

లేజర్ చికిత్స, యాంటీ వీఈజీఎఫ్ ఇంజెక్షన్లు, శస్త్రచికిత్స ద్వారా వ్యాధి తీవ్రతను తగ్గించవచ్చు. ఆర్‌ఓపీ తీవ్రమైతే స్టేజ్ 3 వరకు వైద్య చికిత్స అవసరం. వ్యాధి 4 లేదా 5 దశకు చేరుకున్న తర్వాత శస్త్రచికిత్స అవసరమవుతుంది. ఒక్కసారి చికిత్స తీసుకుంటే ఏటా తప్పనిసరిగా చెకప్ చేయించుకోవాలి. నెలలు నిండకుండా పుట్టిన శిశువులకు ఆర్‌ఓపీ సమస్య ఉంటే ఐదేళ్లు వచ్చే వరకు తగిన చికిత్స అందించడం ఉత్తమని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

నిర్లక్ష్యం చేస్తే...

- చూపు మందగించడం
- మెల్ల కన్ను
- రెటీనల్ డిటాచ్‌మెంట్ గ్లకోమా
- అంబ్లయోపియాతో పాటు చూపు పూర్తిగా కోల్పోయే ప్రమాదముంటుంది.

ఉచితంగా సేవలు



"పుట్టిన బిడ్డ విషయంలో అలసత్వం ఉండకూడదు. లోపాలుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి. తగిన చికిత్స చేయించుకోవాలి. పుట్టిన బిడ్డలో కంటి సమస్యలను గుర్తించి చికిత్స అందించేందుకు చర్యలు చేపడతున్నాం. రెటీనా స్క్రీనింగ్ పరీక్షలు చేయించి, అవసరమైతే కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఆపరేషన్లు చేయిస్తున్నాం. భవిత కేంద్రం ద్వారా ఉచితంగా అందించే సేవలను సద్వినయోగం చేసుకోవాలి.

– గుణశేఖర్, జిల్లా బాల భవిత కేంద్రం, మేనేజర్, తిరుపతి

ముందు చూపు అవసరం



పుట్టిన బిడ్డ విషయంలో తల్లిదండ్రులకు ముందు చూపు అవసరం. విధిగా తగిన పరీక్షలు చేయించుకోవాలి. ముఖ్యంగా హైరిస్క్ ఉన్న పిల్లల విషయంలో జాగ్రత్తలు వహించాలి. తల్లిలోని లోపాలు, వంశపారం పర్యంగా వచ్చే కొన్ని కారణాల వల్ల పుట్టిన బిడ్డల్లో కంటిచూపు మందగించే అవకాశాలు ఉంటాయి. ఇందుకోసం బాల భవిత కేంద్రంలో రెటీనా పరీక్షలు చేయిస్తున్నాం. ఇక్కడ అన్ని సేవలను ఉచితంగానే పొందవచ్చు.

– దుర్గా ప్రసాద్, చిన్నపిల్లల వైద్యుడు, బాల భవిత కేంద్రం, చిత్తూరు

సచివాలయాలతో గ్రామ స్వరాజ్యం




లబ్ధిదారుకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

తిరుపతి మంగళం : మహాత్మాగాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సచివాలయ వ్యవస్థతో సాకారం చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి కొనియాడారు. బుధవారం తిరుపతి 7వ డివిజన్‌లో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా ఆయన మీడియాతో మాట్లాడారు. దేశంలోనే తొలిసారిగా సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టి లక్షలాది మంది యువతకు ఉద్యోగాలు కల్పించి, వారి బతుకుల్లో వెలుగులు నింపిన దేవుడు జగనన్న అని తెలిపారు. వలంటీర్ల ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారుల ఇంటికే చేరుస్తున్నారన్నారు. వలంటీర్లు నిత్యం ప్రజల్లోనే ఉంటూ ఎప్పటి సమస్యలను అప్పుడే పరిష్కరిస్తున్నారని వివరించారు. వలంటీర్ వ్యవస్థతో ప్రభుత్వానికి మంచిపేరు వస్తోందనే కక్షతోనే చంద్రబాబు, పవన్ కల్యాణ్ నీచమైన ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. జగనన్నపై కోపంతో వలంటీర్ల జోలికొస్తే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ముఖ్యమంత్రికి రోజురోజుకూ పెరుగుతున జనాదరణను చూసి ఓర్వలేకే ప్రభుత్వంపై విపక్షనేతలు బురదజల్లేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. చంద్రబాబు, పవన్ ఎన్ని జిమ్మిక్కులు చేసినా.. ఎన్ని మోసపు మాటలు చెప్పినా రాబోయే ఎన్నికల్లో జగనన్నను ఓడించడం సాధ్యంకాదని స్పష్టం చేశారు.

భద్రతా ప్రమాణాలు తప్పనిసరి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్ : పరిశ్రమల్లో నిబంధనల మేరకు తప్పనిసరిగా భద్రతా ప్రమాణాలు పాటించాలని కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించేలా పనిచేయాలని సూచించారు. సింగిల్ డెస్క్ విధానంలో ఏప్రిల్ నుంచి 255 పరిశ్రమలకు గాను 224 అనుమతులు ఇచ్చామని మరో 28 పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. పరిశ్రమల పరిశీలన కమిటీకి అందిన మేరకు 71 పరిశ్రమలకు ప్రోత్సాహకాలుగా రూ.4.07 కోట్లు అందించడానికి అనుమతించినట్లు వెల్లడించారు. ఫ్యాక్టరీల్లో ప్రమాదాల నివారణకు సేఫ్టీ మేనేజ్‌మెంట్‌పై అవగాహన కల్పించాలని కోరారు. డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలను తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఉడ్ కార్వింగ్, కాపర్ వేజెల్స్, శారీ ప్రింటింగ్- డైయింగ్, పవర్‌లూమ్ క్లస్టర్ల ఏర్పాటుకు ఆయా ప్రాంతాల్లో చేపట్టన చర్యల పురోగతిపై సమీక్షించారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి ప్రతాప్‌రెడ్డి, జోనల్ మేనేజర్ ఏపీ ఐఐసీ తిరుపతి చంద్రశేఖర్, లీడ్ బ్యాంకు మేనేజర్ సుభాష్, సహాయ కమిషనర్, కార్మిక శాఖ కృష్ణారెడ్డి, జిల్లా అగ్నిమాపక అధికారి రమణయ్య పాల్గొన్నారు.

ఇంటర్–మోడల్ స్టేషన్ ప్రక్రియ వేగవంతం



కేంద్ర కార్యదర్శితో మాట్లాడుతున్న ఎంపీ గురుమూర్తి

తిరుపతి మంగళం : తిరుపతి బస్ టెర్మినల్‌లో అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలతో ఇంటర్- మోడల్ స్టేషన్ నిర్మాణం కోసం అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని ఎంపీ గురుమూర్తి కోరారు. బుధవారం ఈ మేరకు ఢిల్లీలో కేంద్ర రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ సెక్రటరీకి వినతిపత్రం సమర్పించారు. ఇటీవల తిరుపతికి విచ్చేసిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ 4 లేన్ల తిరుపతి బైపాస్‌ను అప్‌గ్రేడ్ చేయాలని సూచించారని పేర్కొన్నారు. రహదారి విస్తరణ పనులను పీడీ తిరుపతికి మార్చాలని విన్నవించారు. పూతలపట్టు -నాయుడుపేట, చెన్నై- సూరత్ గ్రీన్ ఫీల్డ్ రహదారులను కలుపుతూ రోడ్డు నిర్మించాలని సూచించారు. ఏర్పేడు నుంచి ఐఐటీ తిరుపతి సర్కిల్ వరకు అభివృద్ధి చేయాలని కోరారు. కేంద్ర కార్యదర్శి సానుకూలంగా స్పందించినట్లు ఎంపీ వెల్లడించారు.

కుప్పం చరిత్రను తిరగరాద్దాం

- ఎన్నేళ్లు బాబును భరిస్తారు!
- ఆలోచించి..ఆదరించండి..
- దొంగ ఓట్ల ఏరివేతను మేమూ ఆహ్వానిస్తాం
- పీఏల పాలనకు స్వస్తి పలకండి
- కుప్పం పర్యటనలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



మల్లానూరు సభలో ప్రసంగిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

కుప్పం: 'ఎన్నిల ముందు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు 99 శాతం అమలు చేశారు..రాష్ట్రంలో ఓట్లు అడిగే అర్హత కలిగిన ఏకైక పార్టీ వైఎస్సార్ సీపీ మాత్రమే.. ఈ నేపథ్యంలో కుప్పం చరిత్రను తిరగరాసేందుకు ప్రజలు ఏకం కావాలి.' అని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. కుప్పంలో పల్లె బాట కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని వెండుగంపల్లి, నడుమూరు, వసనాడు, మంకలదొడ్డి, మల్లానూరు, టీ సదుమూరు, మెట్లచేను, పైపాళెం పంచాయతీల్లో పర్యటించి, ప్రసంగించారు. ఎన్నికల ముందు 600 హామీలు ఇచ్చి జనాలను మోసం చేసినా చంద్రబాబుకు ఓట్లు అడిగే అర్హత లేదన్నారు. జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను నవరత్నాలు ద్వారా నాలుగున్నర ఏళ్లలోనే పూర్తి చేశారన్నారు. కొత్త రాజకీయాలకు తెరదీశామని, ప్రతి పంచాయతీకి వెళుతున్నామని..గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా ప్రతి ఇంటికీ వెళ్లి సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు అర్హత కలిగిన ప్రతి లబ్ధిదారుడికి చేరాలనే ఉద్దేశంతోనే సచివాలయాలు ఏర్పాటు చేసి పథకాలు అమలు చేస్తున్నామన్నారు. కరోనా పరిస్థితుల్లో రాష్ట్రాలు, దేశాలు అతలాకుతలం అయితే, రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిత్యం వైద్యాధి ధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించి, ప్రజలకు అన్ని విధాల సేవలు అందించారని తెలిపారు. ఇదే సమయంలో జాబ్ క్యాలెండర్ ఇచ్చిన విధంగానే సంక్షేమ పథకాలు అమలు చేసి, ప్రజల గుండెల్లో నిలిచిపోయారని, వారి అభిమానం పొందారని చెప్పారు. కుల,మత, పార్టీలకతీతంగా పేదరికమే ప్రమాణికంగా అర్హులైనా ప్రతి లబ్ధిదారుడికీ సంక్షేమం అందివ్వాలని ముఖ్యమంత్రి పనిచేస్తున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 24 లక్షలు ఇళ్లు మంజూరు చేశామని, ఇప్పటి వరకు 6 లక్షల ఇళ్లు పూర్తి అయ్యాయని చెప్పారు. ఎన్నికల లోపు 24 లక్షల ఇళ్లు పూర్తి చేసి, పేదవాడి సొంతింటి కల నేరువేరుస్తామన్నారు.



హాజరైన జనం

ఎన్నేళ్లు బాబును భరిస్తారు!

7 సార్లు 35 ఏళ్లు చంద్రబాబుకు ఓట్లు వేసి గెలిపించారు. ఇంకా ఎన్ని ఏళ్లు మోసపూరిత చంద్రబాబును భరిస్తారు. 14 ఏళ్లుగా ముఖ్యమంత్రిగా ఉన్నా సొంత నియోజక వర్గానికి ఏమి చేశారో ఆలోచించండని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సూచించారు. కుప్పానికి సాగు, తాగునీరు కోసం ఒక ప్రాజెక్టు కట్టారా? లేక యువత కోసం పరిశ్రమలు స్థాపించారా? అని ఆలోచించాలన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 90 శాతం పూర్తి అయిన హంద్రీనీవా కాలువ మిగిలిన పనులు పూర్తి చేసి, కుప్పానికి నీళ్లు తీసుకుని రాలేపోయారని విమర్శించారు. జగన్‌మోహన్ రెడ్డి కుప్పం పర్యటనలో ఇచ్చిన హామీ మేరకు హంద్రీనీవా పథకాన్ని సీఎం చేతుల మీదుగా ప్రారంభించి, కుప్పం పట్టణానికి నీరు తీసుకుని వస్తామన్నారు. అభివృద్ధి పనులు పక్కన పెట్టి, చంద్రబాబు తిట్ల పురాణం ఎత్తుకున్నారని, ఎప్పుడూ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీని తిట్టమే లక్ష్యంగా పెట్టుకున్నారని ఆరోపించారు. చంద్రబాబును గెలిపిస్తే కుప్పం ప్రజలకు ఏమి చేయరని, ఆయన పీఏల పెత్తనంతో ప్రజలు నలిగిపోతున్నారని చెప్పారు. ఈ పీఏల వ్యవస్థకు స్వస్తి పలికాలని సూచించారు. వైఎస్సార్ సీపీని ఆదరిస్తే యువ నాయకులు భరత్ అందరికీ అందుబాటులో ఉండి ప్రజా సమస్యలు పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీలు సిపాయి సుబ్రమణ్యం, భరత్, టీటీడీ పాలక మండలి సభ్యులు పోకల అశోక్ కుమార్ పాల్గొన్నారు.

రేర్ ఎర్త్ టెక్నాలజీతో క్యాన్సర్‌కు చెక్



వర్క్‌షాపులో మాట్లాడుతున్న ఎంఎల్‌పీ రెడ్డి తదితరులు

తిరుపతి సిటీ : రేర్ ఎర్త్ సైన్స్ టెక్నాలజీ ద్వారా క్యాన్సర్ మూలాను గుర్తించి నివారరించవచ్చని ఆర్ఈఏఐ సెక్రటరీ, సైంటిస్ట్ డాక్టర్ ఎంఎల్‌పీ రెడ్డి తెలిపారు. బుధవారం పద్మావతి మహిళా వర్సిటీ సావేరి అతిథిగృహంలో భౌతిక శాస్త్ర విభాగం, రేర్ ఎర్త్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా వారు ఒక్కరోజు వర్క్‌షాపు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రేర్ ఎర్త్ టెక్నాలజీ ద్వారా మానవుని శరీరంలోని క్యాన్సర్ కణాలను గుర్తించి వివిధ ఎక్స్‌రే కిరణాలతో నిర్మూలించవచ్చని వివరించారు. విద్యార్థులు ఈ సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించుకుని పరిశోధనలు చేయాలని సూచించారు. వాతావరణంలోని మార్పులను ముందుగానే తెలుసుకొనేందుకు రేర్ ఎర్త్ సైన్స్ టెక్నాలజీ ఉపయోగకరంగా ఉంటుందన్నారు. వర్సిటీ వీసీ డి.భారతి మాట్లాడుతూ విద్యార్థులు టెక్నాలజీని ఔపోసన పట్టి పరిశోధనాపరంగా ముందుకు సాగాలన్నారు. ఆర్ఈఏఐ ఉపాధ్యక్షుడు ఆచార్య సీకే జయశంకర్ మాట్లాడుతూ భౌతిక శాస్త్రంలో రేర్ ఎర్త్ పరిశోధనలు మానవాళికి ఎంతో ఉపయోగకరమని తెలిపారు. అందుబాటులోని సాంకేతికతను విద్యార్థులు అందిపుచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వర్క్‌షాప్ కన్వీనర్ ఆచార్య బి. దేవప్రసాద్ రాజు, కో-ఆర్డినేటర్ ఆచార్య ఎం.కృష్ణయ్య, భౌతిక శాస్త్రం విభాగాధిపతి ఆచార్య ఎ.శ్రీదేవి, ఆచార్య కె. సుబ్రమణ్యంరెడ్డి, మంజునాథ్, సౌమ్య, మయూరి, వరలక్ష్మి, హిమగిరీష్ కుమార్, బాసమ్మ రజిత, సంధ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇద్దరు ఎర్రదొంగల అరెస్ట్



నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

భాకరాపేట : తిరుపతి- పీలేరు జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి చేపట్టిన వాహన తనిఖీల్లో ఇద్దరు ఎర్రచందనం స్మగ్లర్లు పట్టుబడినట్లు సీఐ తులసీరామ్ తెలిపారు. నిందితుల నుంచి ఓ కారు, నాలుగు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు బుధవారం భాకరాపేట పోలీస్‌స్టేషన్‌లో ఆయన వివరాలు వెల్లడించారు. ఎస్‌ఐలు ప్రకాష్‌కుమార్, వెంకటేశ్వర్లు తమ సిబ్బందితో మూడు బృందాలుగా విడిపోయి తనిఖీలు చేపట్టారన్నారు. ఈ క్రమంలో చట్టివారపాళెం పంచాయతీ నెమిలిగుండ్ల క్రాస్ వద్ద వేగంగా వస్తున్న మారుతీ సుజుకీ విట్రా కారును అడ్డుకుని తనిఖీ చేయగా ఎర్రచందనం దుంగలు పట్టుబడినట్లు వివరించారు. తమిళనాడులోని వేలూరుకు చెందిన అశోక్, వెంకటేషన్‌ను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. స్వాధీనం చేసుకున్న కారు, దుంగల విలువ సుమారు రూ.14లక్షలు ఉంటుందని వెల్లడించారు. తనిఖీల్లో పాల్గొన్న ఎస్‌ఐలతోపాటు కానిస్టేబుళ్లు గురుస్వామి, చరణ్‌కుమార్, లక్ష్మీప్రసాద్ రాజు, ప్రసాద్, బాలసుబ్రమణ్యం, శ్రీకాంత్‌ను ఎస్పీ అభినందించినట్లు సీఐ తెలిపారు.



ప్రగతి మణిహారం

ప్రగతికి ప్రతిరూపం రహదారులే. ఇదే సదాశయంతో రాష్ట్ర హైవేలు, జిల్లా రహదారుల మరమ్మతులు, అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోంది. ఇందుకు పుష్కలంగా నిధులు కూడా కేటాయించింది. ఆయా దారుల అభివృద్ధి.. మరమ్మతులు, వంతెనల నిర్మాణంపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రూ.166.94 కోట్లతో పలు రోడ్లు బాగు చేయనుంది. ఇందుకు సంబంధించి టెండర్లను కూడా పిలిచింది.

444.03 కిలోమీటర్లు దూరం అభివృద్ధి
- రూ.166.94 కోట్లు నిధులు
- టెండర్లకు ఆహ్వానం

సాక్షి తిరుపతి/చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలో రోడ్ల మరమ్మతు, అభివృద్ధి పనులపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన రాష్ట్ర హైవే రోడ్లు, మేజర్ డ్రిస్టిక్ రోడ్లను మరమ్మతు చేయనున్నారు. ఈ పనులకు నిధులు కేటాయించి టెండర్లను ఆహ్వానించారు.

స్టేట్ హైవే పనుల వివరాలివీ..

శ్రీకాళహస్తిలో పాపానాయుడుపేట-శ్రీకాళహస్తి రోడ్డు 21.75 కిలోమీటర్లు దూరం మరమ్మతుకు రూ.6.20 కోట్లు, చంద్రగిరిలో తిరుపతి-కొత్తపల్లెమిట్ట రోడ్డులో తిరుపతి నుంచి 7 కిలోమీటర్లు దూరం మరమ్మతుకు రూ.3.50 కోట్లు కేటాయించింది. అలాగే పీలేరు-భాకరాపేట వయా యలమంద దారి 21 కిలో మీటర్ల రూ.5 కోట్లు, అరకోణం-రేణిగుంట దారి రూ.1.20 కి.మీ రూ.2.20 కోట్లు, సత్యవేడులో పుత్తూరు-సత్యవేడు రోడ్డు 14.50 కి.మీ రూ.5 కోట్లు, తాడా-సత్యవేడు రోడ్డు 8 కి.మీ, రూ.4.50 కోట్లు, జీడీనెల్లూరులో కలువగుంట-నేంద్రగుంట వయా పెనుమూరు రోడ్డు 16 కి.మీ, రూ.5.50 కోట్లు, తిరుపతి-కొత్తపల్లెమిట్ట రోడ్డు 27.60 కి.మీ రూ.8 కోట్లు, పూతలపట్టులో చిత్తూరు-అరగొండ వయా పాటూరు రోడ్డు 6.80 కి.మీ, రూ.3 కోట్లు, పుంగనూరు పులిచెర్ల-చిన్నగొట్టిగల్లు రోడ్డు 6.80 కి.మీ, రూ.1.95 కోట్లు, తంబళ్లపల్లెలో ముడివీడు-తంబళ్లపల్లె 23.20 కి.మీకు రూ.7.80 కోట్లు, మదనపల్లెలో మదనపల్లె-



యాదమరిలో మరమ్మతు చేయనున్న 184 గొల్లపల్లె దారి

చెబకూరు- రామసముద్రం రోడ్డు 19.74 కి.మీ, రూ.4.80 కోట్లు, మదనపల్లెలో మదనపల్లె-కందూరు వయా నిమ్మనపల్లె రోడ్డు 19 కి.మీ రూ.5 కోట్లు కేటాయించింది.

మేజర్ డ్రిస్టిక్ రోడ్డు వివరాలివీ...

చంద్రగిరిలో తిరుపతి-చంద్రగిరి రైల్వే ఫీడర్ రోడ్డు 3.53 కి.మీ, రూ.1.10 కోట్లు, దామలచెరువు-నేంద్రగుంట రోడ్డు 4.28 కి.మీ.రూ.1.70 కోట్లు, శ్రీకాళహస్తిలో ఆర్‌పీకే రోడ్డు - పాయాల్ సెంటర్ వయా చెల్లూరు 5 కి.మీ రూ.1.20 కోట్లు, పూతలపట్టులో ఎంసీబీ రోడ్డు-పీజీ రోడ్డు వయా రాగిమానుపెంట, కీరమంద బండ్లదొడ్డి రోడ్డు 8.60 కి.మీ రూ.1.60 కోట్లు, సీకేటీ రోడ్డు-చిత్తూరు రోడ్డు-ఐరాల రోడ్డు వయా వావిల్‌తోట, లక్ష్మయ్యవూరు 7 కి.మీ రూ.1.60 కోట్లు, సరకలు-మాధవరం రోడ్డు 10 కి.మీ రూ.2.40 కోట్లు, చిత్తూరు-అరగొండ రోడ్డు 5.60 కి.మీ రూ.1.85 కోట్లు, బంగారుపాళెం-అరగొండ రోడ్డు 1.60 కి.మీ రూ.75 లక్షలు, సీజీ రోడ్డు వయా తాళంబేడు, మాదిరెడ్డిపల్లె, 184 గొల్లపల్లె రోడ్డు 5.80 కి.మీ రూ.1.96 కోట్లు, ఉయాలచింత-కీనాటంపల్లె రోడ్డు 4 కి.మీ రూ.92 లక్షలు, నగరిలో బుగ్గ-ఐలత్తూరు రోడ్డు 5 కి.మీ రూ.1.95 కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. అలాగే పూతలపట్టులోని సీకేటీ రోడ్డు-పీఎన్ రోడ్డు వయా పోలవరం, గొడుగుచింత 3 కి.మీ రూ.1 కోటి, చిత్తూరు-ఐరాల రోడ్డు తుమ్మలవారిపల్లె వయా మట్లిపల్లె, సీకేటీ రోడ్డు-ఎర్రేపల్లె, వయా కీలపల్లె, గాండ్లపల్లె, 3 కి.మీ రూ.60



హైలెవల్ వంతెన నిర్మించనున్న జీడీనెల్లూరు మండలం ఉడమలకుర్తి వద్ద వాగు

లక్షలు, జీడీనెల్లూరులో రాచపాళెం-వనదుర్గాపురం-బలిజకండ్రిగ 3.35 కి.మీ రూ.90 లక్షలు కేటాయించింది. చిత్తూరు-కడప-కర్నూలు వయా దొడ్డిపల్లె వేల్‌త్తూరు, చిత్తూరు-పుత్తూరు రోడ్డు వయా కొట్రకోన రోడ్డు ఎట్టేరి నుంచి, చిత్తూరు-పుత్తూరు రోడ్డు వయా దేవళంపేట, మారేడుపల్లె, వెజ్జుపల్లె, దామరగుంట 10.40 కి.మీ రూ.2.70 కోట్లు, జీడీనెల్లూరు-బలిజకండ్రిగ 8.65 కి.మీ రూ.3.20 కోట్లు, వీటితో పాటు ఏపీఆర్‌ఆర్‌పీ కింద జీడీనెల్లూరు నియోజకవర్గంలో 47.31 కిలోమీటర్లను రూ.32.21 కోట్లతో రోడ్డును నిర్మించనున్నారు. చిత్తూరు-పుత్తూరు మార్గంలో ఉడమలకుర్తి వయా పిళ్లారికుప్పం వద్ద 1.5 కి.మీ, రూ.27 కోట్లతో హై లెవల్ బ్రిడ్జి నిర్మించనున్నారు. రాచపాళెం-వనదుర్గాపురం నుంచి బలిజకండ్రిగ, హంసాపురం-టీపీఎస్‌ఆర్ పురం మార్గం మరమ్మతు కింద 28 కి.మీ, రూ.2 .05 కోట్లతో పనులు చేయనున్నారు. కుప్పంలో కుప్పం-మల్లానూరు రోడ్డు వయా పైపాళెం, మోటలచేను 5.20 కి.మీ, రూ. కోటి, గడ్డూరు-కేకే బార్డర్ వయా కీనామాకులపల్లె, 121 పెద్దూరు 5.60 కి.మీ రూ.1 కోటి, గోవిందపల్లె, దండికుప్పం వయా శివరామాపురం 7.25 కి.మీ, రూ.1.65 కోట్లు కేటాయించింది. కుప్పం-గుడుపల్లెరోడ్డు-అగరం క్రాస్ 2.40 కి.మీ, రూ.కోటి పుంగనూరులో పుంగనూరు-కోలార్‌రోడ్డు యాటవాకిలి-పత్రాపల్లె రోడ్డుకు 8.21 కి.మీ రూ.1.60 కోట్లు, డీపీరోడ్డు-పీపీసీ రోడ్డు వయా బైరెడ్డిగారిపల్లె 7.24 కి.మీ రూ.1.50 కోట్లు, పలమనేరులో పలమనేరు-కుప్పం టు తమిళనాడు బార్డర్ వయా కొలమాసనపల్లె, నేలిపట్ల, రంగంపేట 3 కి.మీ రూ.50 లక్షలు, మదనపల్లెలో మదనపల్లె-కృష్ణాగిరిరోడ్డు 3.24 కి.మీ, అనంతపురం-చెన్నై రోడ్డు 1.45కి.మీ, రూ.1.45 కోట్లు, పీలేరులో పొంతలచెరువు-తిమ్మాపురం రోడ్డు 20 కి.మీ రూ.6 కోట్లు, వాయల్పాడు-గుండ్లూరు 14.2 కి.మీ రూ.1.80 కోట్లు, తంబళ్లపల్లె బి.కొత్తకోట స్టేట్‌బార్డర్ రోడ్డు 8.3 కి.మీ రూ.1.30 కోట్లతో వేయనున్నారు. ఉమ్మడి జిల్లాలో స్టేట్ హైవే 192.59 కి.మీ దూరం రూ.62.45 కోట్లతో, మేజర్ డ్రిస్టిక్ రోడ్లు, ఏపీఆర్‌ఆర్‌పీ, బ్రిడ్జి నిర్మాణానికి 247.71 కి.మీ రూ.104.49 కోట్లతో వేయనున్నారు.



పలమనేరులో నిర్మాణం చేపట్టనున్న కొలమాసనపల్లె వయా నెల్లిపట్ల దారి

టెండర్లు పిలిచాం



జిల్లాలో రోడ్ల మరమ్మతు పనులకు సంబంధించి టెండర్లు పిలిచారు. ఈ మేరకు స్టేట్‌హైవే, మేజర్ డ్రిస్టిక్ రోడ్లు, లేయింగ్, మరమ్మతు పనుల కోసం ప్రభుత్వం టెండర్లు ఆహ్వానించింది. టెండర్ దశ పూర్తయ్యాక రోడ్డు పనులు చేపడతాం. ఈ పనులు జరిగితే ప్రయాణం సాఫీగా సాగుతుంది.

– ఉమామహేశ్వర్‌రెడ్డి, ఎస్‌ఈ ఆర్‌అండ్‌బీ



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.61,490
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,522
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.76,600
రిటైల్ వెండి గ్రాము	రూ.78.60

సైబర్ క్రైమ్ బాధితుడికి న్యాయం

తిరుపతి క్రైం : సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన ఓ బాధితుడికి పోలీసులు న్యాయం చేశారు. బుధవారం ఈ మేరకు సదరు బాధితుడికి పోగొట్టుకున్న నగదును అందజేశారు. వివరాలు.. ఎస్వీయూ సమీపంలోని బాలాజీ కాలనీకి చెందిన డాక్టర్ రమేష్‌కు తన బ్యాంకు అకౌంట్ నుంచి జూన్ 30వ తేదీన రూ.17,500 లావాదేవీ జరిగినట్లు మెసేజ్ వచ్చింది. దీంతో రమేష్ వెంటనే తన ఖాతాను చెక్ చేసుకోగా మొత్తం రూ.1,56,092 పోయినట్లు తెలిసింది. దీంతో అప్రమత్తమైన బాధితుడు వెంటనే తిరుపతి సైబర్ క్రైమ్ కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు సైబర్ ల్యాబ్ ఇన్‌స్పెక్టర్ రామచంద్రారెడ్డి నేతృత్వంలో దర్యాప్తు ప్రారంభించారు. బాధితుడి ఖాతా నుంచి సొమ్మును సైబర్ నేరగాడు తన అమెజాన్ వాలెట్‌కు తరలించినట్లు గుర్తించారు. వెంటనే అమెజాన్ నోడల్ అధికారులతో మాట్లాడి నగదును స్తంభింపజేశారు. తిరిగి మొత్తం సొమ్మును బాధితుడు రమేష్‌కు అందజేశారు. దీనిపై ఇన్‌స్పెక్టర్ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రజలు సైబర్ మోసానికి గురైతే అధైర్య పడకుండా తిరుపతి పోలీసు పరేడ్ మైదానంలోని సైబర్ క్రైమ్ కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేయాలన్నారు. లేకుంటే 1930 నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయవని సూచించారు.

నెల్‌కాస్ట్‌లో కార్మికులకు శిక్షణ

నెల్లూరు(సెంట్రల్): పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో గూడూరులోని నెల్‌కాస్ట్ పరిశ్రమలో పరిశ్రమల్లో వర్క్‌పర్మిట్ సిస్టంపై బుధవారం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు డిప్యూటీ చీఫ్ ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ శైలేంద్రకుమార్ తెలిపారు. వివిధ పరిశ్రమల నుంచి దాదాపు 79 మంది కార్మికులు శిక్షణలో పాల్గొన్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో అధికారులు అనిల్‌కుమార్, విన్సెంట్‌పాల్, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఫ్రీ నగరంగా తిరుపతి



బాలాజీ కాలనీలో ఫ్రీ లెఫ్ట్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డి

తిరుపతి తుడా: ఆధ్యాత్మిక క్షేత్రం తిరుపతిని ట్రాఫిక్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దేందుకు పకడ్బందీ చర్యలు చేపడుతున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ డి. హరిత తెలిపారు. బుధవారం ఆమె డిప్యూటీ మేయర్ భూమన అభినయన్‌రెడ్డి, ఇంజినీర్లతో కలిసి బాలాజీ కాలనీ, టౌన్ క్లబ్ కూడళ్లలో అభివృద్ధి చేసిన ఫ్రీ లెఫ్ట్ పనులను పరిశీలించారు కమిషనర్ మాట్లాడుతూ దశాబ్దాలుగా నగరవాసులు ట్రాఫిక్ ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్యలను అధిగమించేందుకు ఇప్పటికే అనేక ప్రాంతాల్లో రోడ్ల విస్తరణ, ఫ్రీ లెఫ్ట్‌ల అభివృద్ధి పనులను చేపట్టినట్లు వెల్లడించారు. త్వరలో వీటిని అందుబాటులోకి తీసుకురానున్నట్లు వివరించారు. డిప్యూటీ మేయర్ భువన అభినయ్‌రెడ్డి మాట్లాడుతూ నగరంలో ఇరుకు రోడ్లు, విశాలవంతమైన కూడళ్లు లేకపోవడంతో ట్రాఫిక్ కష్టాలు వస్తున్నాయన్నారు. అందుకే నగర ప్రజల సౌకర్యార్థం ఏడు ప్రాంతాల్లో ఫ్రీ లెఫ్ట్‌లను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. అలాగే ఇరుకు రోడ్లను విశాలంగా విస్తరించేందుకు చర్యలు చేపట్టామని చెప్పారు. సంగీత కళాశాల ఫ్రీ లెఫ్ట్ ను అత్యంత సుందరంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. ఆధ్యాత్మికత ఉట్టిపడేలా నగరంలోని కూడళ్లు, రహదారులను అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, హనుమంత నాయక్, కో-ఆప్షన్ సభ్యుడు ఇమామ్ సాహెబ్, మున్సిపల్ ఇంజినీర్ వెంకట్రామిరెడ్డి, డీఈ రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

తుమ్మలగుంట స్ఫూర్తితో చంద్రగిరి అభివృద్ధి



తుమ్మలగుంటలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: ఆధ్యాత్మికతతోపాటు విద్య, వైద్యం, పలు పనులతో తుమ్మలగుంట గ్రామం అభివృద్ధి చెందిందని, ఆ స్ఫూర్తితో చంద్రగిరి నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. తుమ్మలగుంటలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. లబ్ధిదారులకు 665 సర్టిఫికెట్లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ అర్హత కలిగిన వంద శాతం మందికి ప్రభుత్వ పథకాలు అందించడమే జగనన్న సురక్ష కార్యక్రమం ఉద్దేశమని వెల్లడించారు. ఇందులో భాగంగా రేషన్ కార్డు, ఆదాయం, కుల ధ్రువీకరణ పత్రాలు సహా 11 సేవలను ప్రజలకు ఉచితంగా అందజేస్తున్నట్టు చెప్పారు. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి స్వయం కృషితో రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది, నేడు రాష్ట్ర స్థాయి నేతగా ఎదిగారని తెలిపారు. గ్రామాభివృద్ధిలో ఆయన చేసిన కృషి మరవలేనిదన్నారు. కన్నతల్లి వంటి సొంతూరు అభివృద్ధికి ముందుండే నాయకుడికి రాజకీయ పునాది వేసిన తుమ్మలగుంట అంటే ఎంతో ఇష్టపడే వారని పేర్కొన్నారు. రాష్ట్రంలోనే గర్వించేలా అభివృద్ధి సాధించిన తుమ్మలగుంట స్ఫూర్తితో, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మార్గదర్శకంలో చంద్రగిరి నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్నీ అభివృద్ధి చేస్తామన్నారు. ఆయన అడుగుజాడల్లో నడుస్తూ మీ బిడ్డగా ప్రజా సేవలో తరిస్తానని తెలిపారు. ప్రజలకు ఎంతో మేలు చేస్తున్న జగనన్నను ప్రజలు మరో మారు ఆశీర్వదిస్తారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నల్లందుల సుబ్బరామిరెడ్డి, ఎంపీటీసీ బుజ్జమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు చెవిరెడ్డి జయచంద్రారెడ్డి, నల్లందుల సుధాకర్‌రెడ్డి, గోపాల్ రెడ్డి, కృష్ణారెడ్డి, రాజారెడ్డి, రామచంద్రారెడ్డి, దొడ్ల కరుణాకర్‌రెడ్డి, పార్లపల్లి దామోదర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, చెంచురామయ్య పాల్గొన్నారు.

ఎండీయూ ఆపరేటర్లకు 'మిత్ర' సాయం



కమిషనర్‌కు సమస్యలు తెలియజేస్తున్న ఆపరేటర్లు

తిరుపతి కల్చరల్ : ఎండీయూ ఆపరేటర్లకు వాహన మిత్ర నగదు అందించడంతోపాటు వేతన బకాలను వెంటనే విడుదల చేస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ అరుణ్‌కుమార్ భరోసా ఇచ్చారు. బుధవారం ఈమేరకు ఎండీయూ ఆపరేటర్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో విజయవాడలోని పౌరసరఫరాల శాఖ కార్యాయంలో కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించారు. స్పందించిన కమిషనర్ ఎండీయూ ఆపరేటర్ల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కోవిడ్ సమయంలో మరణించిన 58 మంది ఆపరేటర్లకు రూ.లక్ష చొప్పున పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. వాహనాలకు ఫిట్‌నెస్ అపరాధం లేకుండా చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవికుమార్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి సాంబశివరావు, సుధాకర్‌రెడ్డి, వేణు, అరవింద్, హేమంత్ పాల్గొన్నారు.

తిరుమలలో రెస్ట్‌హౌస్ ప్రారంభం



విశ్రాంతి గృహాన్ని ప్రారంభిస్తున్న టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి

తిరుమల : తిరుమలలో జగదీష్ నారాయణి విశ్రాంతి గృహాన్ని టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన దాతలు ఓం ప్రకాష్ అగర్వాల్, సునీతా అగర్వాల్‌ను ఆయన ఘనంగా సత్కరించారు. రిసెప్షన్ డిప్యూటీ ఈఓ హరీంద్రనాథ్, ఓఎస్డీ రామకృష్ణ, వీజీఓలు బాలిరెడ్డి, గిరిధర్‌రావు పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా యువకుడి మృతి

తడ: స్థానిక అపార్ట్ మెంట్ వద్ద ఓ యువకుడు అనుమాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన బుధవారం వెలుగుచూసింది. తమిళనాడులోని గుమ్మిడిపూండి తాలూకా చెదిల్‌పాకు గ్రామానికి చెందిన పి.జానకిరామన్(27) కారు డ్రైవర్‌గా పనిచేసేవాడు. 23వ తేదీ రాత్రి 10గంటల సమయంలో ఇంటికి ఫోన్ చేశాడు. తర్వాత ఫోన్ పనిచేయకోవడంతో కుటుంబీకులు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో తడలోని ఓ అపార్ట్ మెంట్ లిఫ్ట్ వద్ద దుర్వాసన రావడంతో స్థానికులు పరిశీలించగా కుళ్లిన స్థితిలో ఓ మృతదేహం కనిపించింది. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. మృతదేహం వద్ద లభించిన ఫోన్ నంబర్ ద్వారా మృతుడి ఆచూకీ తెలుసుకుని కుటుంబీకులకు సమాచారం అందించారు. అపార్ట్‌మెంట్‌లోని ఓ మిత్రుడి ఇంట్లో రాత్రి భోజనం చేసి కిందకు వచ్చిన తర్వాత లిఫ్ట్ గుంతలో ఎలా పడిపోయడో తెలుసుకునే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ నేత అక్రమాలపై ఫిర్యాదు



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న గురుమూర్తి

చంద్రగిరి(తిరుపతి రూరల్) : తమ భూములను తమకే తెలియకుండా అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న చంద్రగిరి మండలం టీడీపీ అధ్యక్షుడు పల్లినేని సుబ్రమణ్యంనాయుడుపై చర్యలు తీసుకోవాలని రైతు గురుమూర్తి కోరారు. బుధవారం ఈ మేరకు తహసీల్దార్ శిరీషకు వినతిపత్రం అందించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం పేరుతో పలువురి ఆస్తులను దోచుకుంటున్న అక్రమార్కుడిపై భూకబ్జా కేసులు నమోదు చేయాలని పేర్కొన్నారు. పనపాకం గ్రామానికి చెందిన బాధితుడు గురుమూర్తి మాట్లాడుతూ తన తండ్రి గురవయ్యకు చెందిన 4.57 ఎకరాల భూమిలో దాదాపు రూ.6 కోట్ల విలువైన 2.50 ఎకరాలను టీడీపీ నేత పల్లినేని సుబ్రమణ్యంనాయుడు ఇతరులతో కలిసి నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ఆరోపించారు. తన తండ్రి మొదటి భార్య కుమార్తె 1988లోనే హక్కు విడుదల పత్రం రాసి దానిని రిజిస్ట్రేషన్ చేసిందన్నారు. అయితే సుబ్రమణ్యం నాయుడు ఈ విషయాన్ని దాచిపెట్టి రెడ్డెమ్మ అనే మహిళతో కలిసి కబ్జా చేసేశాడని మండిపడ్డారు. వీఆర్‌ఓ శ్రీనివాస్ కూడా కబ్జాదారులకే వత్తాసు పలుకుతూ ఆన్‌లైన్లో మార్పులు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందులో భాగస్వాములైన వారందరిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్పందించిన తహసీల్దార్ శిరీష మాట్లాడుతూ హక్కు విడుదల పత్రం ఉన్నట్లు తమ దృష్టికి రాలేదని, విచారించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.